




వేదికపై యోగాసనం వేస్తున్న బాలిక

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు





కాకినాడలో విజయవంతంగా.. మెగా యోగా

- రికార్డుస్థాయిలో ఏడువేలమందితో యోగాసనాలు 7
- ఆకట్టుకున్న ఓంకారం.. కిలోమీటరు మేర కార్యక్రమం
- యోగాసనాలు వేసిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు





కాకినాడ మెయిన్‌రోడ్డులో కిలోమీటరు పొడవున యోగాసనాలు వేస్తున్న ప్రజలు.. వేదికపై మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, పక్కనే ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీలు పద్మశ్రీ, రాజశేఖరం

కాకినాడ నగరం యోగాసనాలతో కళకళలాడింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి రికార్డుస్థాయిలో ఏడువేల మంది హాజరుకాగా.. మెగా యోగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కాకినాడ టూటౌన్ నుంచి ఎల్‌ఐసీ భవనం వరకు కిలోమీటరు మేర పెద్దఎత్తున పచ్చటి కార్పెట్లు పరచగా వేలమంది ఉదయం 7గంటల నుంచి యోగా ఆసనాలు వేయడం ప్రారంభిం చారు. యోగాలో వివిధ భంగిమల్లో ఆసనాలు వేశారు. వేదికపై యోగా శిక్షకులు రామానంద ఆసనాలు వేయగా హాజరైన వారం తా అయన్ను అనుసరించారు. కిలోమీటరు మేర ఒకే తరహా లైన్‌లో కూర్చుని యోగా సనాలు వేశారు. ఓంకారం ఆకారంలో వేసిన యోగాసనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



తాళ్లపూడి మండలం సూరయ్యపేటలో పునాదిలో నిలిచిన ఇంటి నిర్మాణాలు

ఇచ్చేది చాలక.. ఇల్లు కట్టలేక!

పేదల గూడు..కష్టాలు బోలెడు

- సాయం రూ.2.30 లక్షలు
- అయ్యేది రూ.5.75 లక్షలు
- ముందుకు రాని ప్రజానీకం
- నెరవేరని నిర్మాణ లక్ష్యం
- అధికారులపై తీవ్ర ఒత్తిడి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు..అన్నారు పెద్దలు.. ఆ రెండూ అంత కష్టమైన పనులన్న మాట... పెళ్లి మాటేమో కానీ.. ఇల్లు కట్టాలంటే మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో గగనంగా మారింది. ఒక వేళ కష్టపడిన కట్టినా పూర్తవకుండానే అమ్మేసుకుంటున్న వారెందరో.. ఇంటి నిర్మాణం అనేది సాధారణ, మధ్యతరగతి ప్రజలకు కలగానే మారింది. ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇళ్ల కట్టుకోమన్నా కట్టుకోలేని స్థితిలో పేదలు ఉన్నారు.

రూ. 1.80 లక్షలకు ఇల్లు కట్టగలమా?

2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల ఆర్థిక సమస్యలను గుర్తించి బ్యాంకు రుణం ఇప్పించి టిడ్కో ఇళ్ల నిర్మిం చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్లను మూలన పడేసి పేదలకు సెంటుభూమి ఇచ్చి అందులోనే రూ.1.80 లక్షతో ఇల్లు నిర్మించుకోవాలనే విధానాన్ని అమల్లోకి తెచ్చింది.సెంటు స్థలంలో రూ.1.80 లక్షలతో పునాది కూడా పడదు. అయినా చాలా మంది పేదలు అప్పో సప్పో చేసి ఇల్లు కట్టేసుకున్నారు.ప్రస్తుతం ఇళ్లను అమ్మే సుకుంటున్నారు.ఏ కాలనీకి వెళ్లినా ఇల్లు అమ్మబడును అనే బోర్డు లు దర్శనమిస్తున్నాయి.

రూ.2.30 లక్షలు చేసినా ఇబ్బందే..

2024 సార్వత్రిక ఎన్ని కల్లో తెలుగుదేశం హయాంలో కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో పేదలకు భారీ ఎత్తున సహాయ పడాలనే ఆలోచనకు వచ్చింది. ఎస్సీ, బీసీ లబ్ధిదార్లకు రూ.50 వేల వంతున, ఎస్టీలకు రూ.75 వేల వంతున ఆర్థిక సహాయం చేసినా పేదోడు ఇంటి నిర్మాణానికి ఖర్చు సరిపోవడంలేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేకపోతున్నారు.తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈనెల 12వ తేదీకి సామూహిక గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయాలని ఆదేశించినా ఆర్థిక సమస్యలతో ముందుకు రావడంలేదు.లబ్ధిదారులను ఒప్పించాలని అధికారులు ప్రయత్నించినా వెనకడుగు వేస్తున్నారు.ఉన్నతాధికారులు టార్గెట్లు విధించడంతో సచివాలయ,హౌసింగ్, రెవెన్యూ అధికారులు, ప్రత్యేకాధికారులపై ఒత్తిడి తప్పడం లేదు.

ఇల్లు కట్టాలంటే..అప్పు చేయాల్సిందే..

కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.2.30 లక్షల వరకూ ఇస్తున్నా.. లబ్ధిదారులు ముం దుకు రావడంలేదు. ఏదో కొద్దిగా ఆర్థిక స్తోమత ఉన్నవారు మాత్రమే ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.ఎందుకంటే గత జగనన్న కాలనీల్లో ఒక్కో లబ్ధిదారుకు ఇచ్చిన 51 గజాల్లో 20 టు 20 అడుగులు మేర ఇల్లు నిర్మించి రంగులతో సహా అందివ్వాలంటే రూ.5.75 లక్షలు అవుతుందని అంచనా ఉంది. బేస్‌మెంట్‌కు రూ.లక్షా 10 వేలు, కిటికీలు, గుమ్మాలు పెట్టి గోడలు కట్టడానికి మరో రూ.1 లక్షా 10 వేలు,



సూరయ్యపేటలో అమ్మకానికి ఇల్లు

శ్లాబ్‌కు రూ.1 లక్షా 20 వేలు,ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్కుకు రూ.60 వేలు, ప్లాస్టింగ్‌కు రూ.ఒక లక్ష వరకూ అవుతుంది. ఇలా సాధారణంగా కట్టుకుంటే రూ.5.75 లక్షలు అవుతుంది. అయితే ప్రభుత్వం ఇచ్చేది రూ.2.30 లక్షలు అంటే మరో రూ.3.45 లక్షలు అప్పు చేయక తప్పని పరిస్థితి.దీంతో ఇంటి నిర్మాణానికి పేదలు ముందుకు రావడంలేదు. కట్టే ఇంటిపై బ్యాంకు రుణం ఇప్పిస్తే నెమ్మదిగా తీర్చుకుంటామని ఓ లబ్ధిదారుడు చెప్పడం గమనార్హం.



రాజమహేంద్రవరంలో శనివారం ఎండమావులు

మే.. రుతు పవనాలు!

మే నెలలో హాయ్.. జూన్‌లో బాబోయ్!

- ఉక్కబోతతో జనం విలవిల
- సుర్రుమంటున్న సూరీడు
- ఏసీ రూమ్‌లకే జనం పరిమితం
- జూన్‌లో వింత వాతావరణం
- ఈ నెల 12న అల్పపీడనం

మొన్న మే నెలలో.. ఎక్కడ చూసినా హాయ్ హాయ్..పెద్దగా కానరాని సూరీడు..రోజంతా చల్లదనమే..మబ్బుల చాటున దాగిన సూరీడుతో మండుటెండలు మాయం.. అనేక చోట్ల వర్షాలు.. నిజంగానే ఇది మే నెలేనా అన్నట్టు కానరాని భారీ ఉష్ణోగ్రతలు..ఊసే లేని వడగాడ్పులు.. ఉక్కబోత...హమ్మయ్య ఈ వేసవి ఇక ముగిసిపోయింది.. అని జనం ఊపిరిపీల్చుకున్నారు... ఈలోపు రుతు పవనాల ఆగమనం... ఇక హాయి హాయి అనుకున్నారంతా.. కానీ!

జూన్‌లో చల్లదనమే అనుకున్నారంతా.. కానీ సూరీడు సుర్రుమంటున్నాడు.. ఉదయం నిద్రలేవగానే బయట ఉక్కబోత.. తీవ్రవేడి.. కానరాని వానలు.. ఎండలు జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. రుతు పవనాలు వచ్చేశాయనుకుంటే వాన జాడ లేక జనం విలవిల్లాడిపోతున్నారు..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

వాతావరణం మారింది.. ఏటా మే నెలో ఎండలు మండిపోతాయి..ఇళ్ల నుంచి బయటకే రాలేం.. జూన్ వచ్చే సరికి వర్షాలు ప్రారంభమై వాతావరణం కొంత చల్లబడుతుంది.ఏళ్ల తరబడి కనిపించే వాతావరణ పరిస్థితులు ఇవే.. అటు వాతావరణ శాఖ కూడా ఏటా మే నెలలో ఎండలు మండిపోతాయని..జూన్‌లో నైరుతి రుతుపవనాలతో పరిస్థితి కాస్త చల్లబడుతుందని చెబుతుంటారు.అదేం విచిత్రమో కానీ.. ఈ సారి వాతావరణం ఉమ్మడి జిల్లాలో జనాలకు చుక్కలు చూపిస్తోంది. మే లో చల్లచల్లని ఆహ్లాదం పంచి..ఇప్పుడు జూన్‌లో వేడి దంచేస్తుంది. వాతావరణశాఖ నిపుణులు సైతం గందరగోళానికి గురైన ప్రస్తుత పరిస్థితులపై రకరకాల విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

చల్లదనమే!

ఈ ఏడాది రొటీన్‌కు భిన్నంగా కాస్త చల్లదనమే' అనిపించాయి. ఉదయం ఎంత భానుడు విశ్వరూపం చూపినా.. సాయంత్రమయ్యేసరికి మాత్రం వరుణుడు కూల్ చేసేవాడు. ప్రతి రోజూ ఉమ్మడి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం నగరాల్లో మే నెలలో అనేక సార్లు భారీ వర్షాలతో వర్షపాతం ఏకంగా ఆరు సెంటీమీటర్ల వరకు నమోదైంది. ఈ మూడు జిల్లాల్లో ఏకంగా అనేక మండలాల్లో వరుసగా 8 రోజులు వర్షం కురిసింది. దీంతో మే నెలంతా చల్లచల్లగా గడిచింది.కాకినాడ జిల్లాలో ఏప్రిల్‌లో 16.4 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉంటే 45.78 మి.మీ. కురిసింది. మేలో 109 మి.మీ.కు 115 మి.మీ. నమోదైంది. జూన్‌కు వచ్చేసరికి 8.1 మి.మీ. తక్కువ నమోదైంది.కోనసీమ జిల్లాలో మే నెలంతా కలిసి 72.55 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 130 మి.మీ. కురిసింది. జూన్‌లో ఈ ఏడు రోజుల్లో ఒక్కరోజు వర్షం నమోదవలేదు.0.65 మి.మీ. లోటు కనిపిస్తోంది. తూర్పు గోదావరి జిల్లాలో మే నెలంతా కలిపి 78.56 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 135.54 మి.మీ. కురిసింది. తీరా జూన్‌కు వచ్చేసరికి ఏడు రోజుల్లో 0.76 మి.మీ. లోటు కొనసాగుతోంది.

బాబోయ్ జూన్..

జూన్ నెల ఆరంభం కాగానే అంతా వర్షాలే అనుకున్నారు.తీరా చూస్తే ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. మూడు రోజులుగా సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.ఆ ప్రచండభానుడి భగభగలతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు.ఉదయం ఆరు గంటల నుంచే వాతావరణం ఉక్కబోతగా ఉంటోంది. పది గంటలకే 'ఉక్క'రూపం దాల్చుతోంది. మధ్యాహ్నం పూర్తిగా నడినెత్తిన చేరుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఈ నెల పదో తేదీన పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ నెల 12న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా. ప్రస్తుత వాతావరణానికి కారణం మందగించిన రుతుపవనాల కదలికే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇవి మందకొడిగా ఉండడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని విశ్లేషిస్తున్నారు.

చౌక.. చకచకా..

- జిల్లాలో 68 శాతం రేషన్ సరుకుల పంపిణీ
- గడిచిన ఐదారు రోజుల్లోనే పెద్దమొత్తంలో అందజేత
- పలు మండలాల్లో 60 నుంచి 80 శాతం ఇప్పటికే పూర్తి
- రేషన్ దుకాణాలే సౌకర్యవంతమంటున్న కార్డుదారులు

రేషన్ దుకాణాల వద్ద నుంచే సరుకులు తీసుకువెళ్లడం సౌకర్యవంతం అంటున్నారు కార్డుదారులు. జిల్లాలో ఇప్పటికే 70 శాతం వరకు నిత్యావసర వస్తువులు బియ్యం, పంచదారను కార్డుదారులు తీసుకువెళ్లారు. ఇంకా ఏడెనిమిది రోజుల్లో మిగిలిన వారికి కూడా సరుకులు పంపిణీ చేయనున్నారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ఈనెల మొదటి నుంచి రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ఉన్న 1060 రేషన్ దుకాణాల ద్వారా ఏడు రోజుల్లో 68 శాతం మేర సరుకులు పంపిణీ పూర్తయ్యింది. ఎండీయూ వాహనాల కంటే వేగంగా డీలర్లు లబ్ధిదారులకు సరుకులు అందించారు. ఎండీయూ వాహనాలవల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారమే తప్ప కార్డు స్థాయిలో మేలు జరగలేదు. గతంలో వీధిలోకి వాహనం వస్తేనే సరుకులు అందేవి. ఆ సమయంలో అందుబాటులో లేకపోతే సరుకులు దక్కేవి కాదు. ఇప్పుడు దుకాణాల ద్వారా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరుకులు తీసుకువెళ్లే వెసులుబాటు ఉంది. దీంతో నచ్చిన సమయంలో లబ్ధిదారులు దుకాణం వద్దకు వచ్చి సరుకులు తీసుకువెళుతున్నారు. ఎండీయూ వాహనాల విధానంతో పోల్చుకుంటే రేషన్ దుకాణాల ద్వారా ఎక్కువ మందికి తక్కువ వ్యవధిలోనే ప్రయోజనం కలుగుతుంది. 65 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దకే నేరుగా డీలర్లు వెళ్లి సరుకులు అందిస్తున్నారు.

ఇప్పటికే 4లక్షలకుపైగా పూర్తి

జిల్లాలో 6,43,874 మంది రేషన్ కార్డుదారులకు 4,35,595మందికి శనివారం నాటికి సరుకులు పంపిణీ పూర్తి చేశారు. ఇంకా 2,08,279 కార్డుదారులు సరుకులు తీసుకోవాల్సి ఉంది. అదే ఇంటింటికీ వాహనాల ద్వారా గతంలో ఈ వారంరోజుల్లో రెండు లక్షల మందికి మాత్రమే పంపిణీ చేయగలిగేవారు.

రౌతులపూడి ఎక్కువ.. పెదపూడి తక్కువ

జిల్లాలోని 21 మండలాల పరిధిలో అత్యధికంగా రౌతులపూడి మండలంలో 82.07 శాతం, కోటనందూరు మండలం 80.35 శాతం, తుని 72.85 శాతం, గొల్లప్రోలు 72.68 శాతం, గండేపల్లి 71.71 శాతం, ఏలేశ్వరం 71.16 శాతం, ప్రత్తిపాడు 70.62 శాతం పూర్తయ్యింది. ఇక మిగిలిన మండలాల్లో 60 శాతానికి పైగా సరుకులు పంపిణీ పూర్తయ్యింది. పెదపూడి మండలంలో మాత్రం 56.15 శాతం సరుకులు పంపిణీ చేశారు.

వృద్ధులు, దివ్యాంగులకు 65శాతం పంపిణీ

జిల్లాలో 65ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారు 71,730మంది ఉన్నారు. ఈనెల 7వ తేదీ వరకు 46,327మంది కార్డుదారులు ఇంటి వద్దనే సరుకులు అందజేశారు. ఇంకా 25,403 మంది పెండింగ్‌లో ఉన్నారు. దాదాపుగా 65 శాతం పంపిణీ పూర్తయ్యింది. మిగిలిన వారందరికీ రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయనున్నారు.

ఖరీఫ్..రిలీఫ్!

ముందస్తు సాగుకు సన్నద్ధం



దమ్ము చేస్తున్న రైతు(ఫైల్)

- ఖరీఫ్ సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం
- 2.27 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం

సామర్లకోట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు ముందస్తు సాగకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వపరంగా వ్యవసాయశాఖ అధికార యంత్రాంగాన్ని ఖరీఫ్ సాగు లక్ష్యాలు పూర్తి చేసేందుకు సమాయత్తం చేస్తోంది.ప్రతీ ఏటా జూన్ నెల మూడో వారంలో ఖరీఫ్ ఊపందుకుంటుంది. ప్రస్తుతం వానలు ముందుగానే పలకరించడంతో ఖరీఫ్ పనులు జూన్ నెల ఆరంభం నుంచే ప్రారంభమయ్యాయి. దీనిద్వారా ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే ప్రకృతి విపత్తులను కొంత మేర తప్పించుకోవచ్చు. మూడో పంట సాగు చేయ వచ్చనేది ఈ ముందస్తు ప్రణాళికలో భాగమైంది.ఈ మేరకు అన్ని సహాయ సహకారాలను వ్యవసాయ శాఖ నుంచి ప్రభుత్వం కల్పిస్తుంది. విత్తనాల నాణ్యత పరిశీలించేందుకు ప్రభుత్వం నుంచి జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు ఆదేశాలు అందుకున్నారు.జిల్లాలో అత్యధికంగా వరి పంట సాగుచేస్తుంటారు. దీంతో ఆయా కంపెనీలు సీజన్ ఆరంభంలోనే విత్తన నాణ్యత ధృవీకరణ పత్రాలను వ్యవసాయ శాఖకు అందించాయి. కాకినాడ జిల్లాలో మొత్తం 22 మండలాల్లో 2.27లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా. దీనికి మరో 62 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు అదనం.ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం ఒక ఎత్తయితే.. మిగులు వర్షపాతం నమోదవుతుందనే అంచనాలను ఐఎండీ చెబుతుండడంతో రైతులు ఖరీఫ్‌పై ఆశలు పెట్టుకున్నారు. గోదావరి కాలువ, ఏలేరు, పంపా, తాండవ, పుష్కర కాలువల ద్వారాను, సుబ్బారెడ్డి సాగర్ తదితర గొట్టపుబావుల భూగర్భజలాలు, చెరువుల ద్వారా ఈ మొత్తం విస్తీర్ణం సాగుచేయనున్నారు. రైతులు సొంతంగా తయారుచేసుకున్న 18,375 మెట్రిక్‌టన్నుల విత్తనాలు, రైతు నుంచి రైతువారీగా సేకరించిన 20,200 మెట్రిక్‌టన్నుల విత్తనాలు, ఏపీ సీడ్స్ ద్వారా 2,460 మెట్రిక్‌టన్నుల విత్తనాలు, ప్రైవేట్ ఏజన్సీల నుంచి 4,904 మెట్రిక్‌టన్నుల విత్తనాలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సాగులో నేరుగా విత్తనాలు వెదజల్లే ప్రక్రియలో 40 శాతంగా 90,300 ఎకరాలు, బెంగాల్ నాట్లులో 67,700 ఎకరాలు, నారుమడులు పోయడం, నాట్లు వేయడం ద్వారా 67,750 ఎకరాల్లో సాగు చేయనున్నారు.

45,939 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

కాకినాడ జిల్లాలో 2,27,750 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేపట్టేందుకు వ్యవసాయ ప్రణాళికలు చేశాం.అందుకు 45,939 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అని నిర్ణయించాం. జిల్లాలో అత్యధికంగా ఎంటీయూ 7029, ఎంటీయూ 1318 రకాల విత్తనాలను 1,41,400 ఎకరాల్లో సాగు చేయనుండగా ఆర్‌జేఎల్ 2537, బీపీటీ 5204 తదితర సాధన, ఓంసాయి, సంపద స్వర్ణ రకాల విత్తనాలు 83,850 ఎకరాల్లో సాగుచేయనున్నారు. అన్ని మండలాల వ్యవసాయాధికారులకు ఖరీఫ్ సాగు లక్ష్యాలు సాధించేందుకు క్షేత్రస్థాయి ప్రణాళికలు నిర్దేశించాం.

- ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయాధికారి

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న కాకినాడ కలెక్టరేట్‌లో జ రగాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దయినట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన వెలువరించారు. జిల్లాలో అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నాన్న అనారోగ్యంతో బాధపడుతుంటే.. చికిత్స చేయించడంలేదు

ఎక్స్‌లో పోస్ట్ చేసిన ముద్రగడ క్రాంతి

కిర్లంపూడి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తన తండ్రి ముద్రగడ పద్మనాభం అనారోగ్యంతో బాధపడుతుంటే తమ్ముడు గిరి, ఆయన మామ సరైన చికిత్స చేయించడంలేదని ఆయన కూతురు క్రాంతి ట్విట్టర్(ఎక్స్)లో శనివారం పోస్ట్‌చేశారు. ఆయన అనుచరులు, శ్రేయోభిలాషులు జోక్యం చేసుకుని సరైన వైద్యం అందించేలా ఒత్తిడి తీసుకురావాలని ఆమె కోరారు. ముద్రగడ క్యాన్సర్‌తో బాధపడుతుంటే యూరాలజిస్టుకు చూపిస్తున్నారని, ఆయన ఆరోగ్యవిషయంలో నిర్లక్ష్యం అనుమానాలకు తావిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'నాన్న ఆరోగ్యం బాగాలేని సమయంలో దాన్ని రహస్యంగా ఉంచడం, అదే సమయంలో తుని ఘటన జీవో వచ్చి అలజడి సృష్టించింది. జీవోగురించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గారి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే సీఎం చంద్రబాబుగారి దృష్టిలో పెట్టడంతో ఆ జీవో రద్దయింది. నాన్నగారి అభిమానులు మనసు పెట్టి ఈ విషయాలన్నీ బేరీజు వేసుకుని ఆలోచన చేయండి' అని ఆమె పోస్ట్ చేశారు.

రేపు నియోజకవర్గాల విజన్‌ప్లాన్ ఆవిష్కరించనున్న సీఎం

అధికారులు సిద్ధంగా ఉండాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న సీఎం చంద్రబాబు అన్నిజిల్లాల, నియోజకవర్గాల విజన్‌ప్లాన్ ఆవిష్కరిస్తారని, జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం విజన్‌ప్లాన్‌పై సంబంధిత అధికారులు, జిల్లా, నియోజకవర్గస్థాయి విజన్‌ప్లాన్ ఆవిష్కరణ, సైనింగ్ స్టార్స్ అవార్డ్ ప్రదాన ఉత్సవ కార్యక్రమం, జిల్లాలో ఇప్పటివరకు పూర్తయిన పనుల ప్రారంభోత్సవాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లాస్థాయి అధికారులు జిల్లాలోను, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు నియోజకవర్గంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావాలన్నారు. ఏ నియోజకవర్గంలో బృందంతోనైనా సీఎం నేరుగా విజన్ ప్లాన్‌పై మాట్లాడే అవకాశం ఉందన్నారు. దీనికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 9న జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియట్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్‌స్టార్ అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. నగదు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమం కాకినాడ బాలాజీచెరువుసెంటర్‌లో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. ఈనెల 11న ప్రతి నియోజకవర్గంలో ఇప్పటివరకు పూర్తిస్థాయి చేసిన పనులు ప్రారంభోత్సవం చేపట్టాలన్నారు. నూతనంగా మంజూరు చేసిన పనులకు శంకుస్థాపనలు చేయాలన్నారు. నియోజకవర్గంస్థాయి కార్యక్రమం ఎక్కడ నిర్వహించాలనే అంశం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐహెచ్ భవనానికి తుది మెరుగులు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సృజనకు చుక్కాని.. నైపుణ్యానికి సాన

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

- యువత భవితకు భరోసా..
- రాష్ట్రంలో ఐదు.. అందులో మనకూ ఒకటి
- ఉభయగోదావరి జిల్లాల యువత నైపుణ్యానికి పదును
- పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ధ్యేయం
- ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో ఆర్ఐటీహెచ్‌ని వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

సానపట్టే కొద్దీ పదునెక్కే యంత్రాలు యువత బుర్రలు.. ఆ మదిలో ఎన్నో ఐడియాలు.. అడుగు వేద్దామంటే ఆర్థిక ఇబ్బందులు. కొత్తగా ఏదైనా చేద్దామనే తపన.. చేతిలో చిల్లిగవ్వ లేని నిస్సహాయత.. తెలివి తేటలకు కొదువ ఉండదు.. కానీ తెల్లారితే రెక్కాడాల్సిందే.. కాస్త ప్రోత్సాహం వారి భుజం తట్టేటట్లు ఉంటే?.. అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి. ప్రభుత్వం అలాంటి ప్రయత్నమే మొదలు పెడుతోంది. అంతరాలను అధిగమింపజేసి శిఖరాలను అందుకునేలా అంకురాలకు (ఎంట్రప్రెన్యూర్స్) పదును పెట్టబోతోంది. 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్' దిశగా వేసిన అడుగే 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్)'లు. ఇవి యువతలో ఉన్న సృజనకు చుక్కాని కానున్నాయి. ప్రభుత్వం యువత విషయంలో ఓ వైపు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తూనే.. మరోవైపు సొంత కాళ్లపై నిలబడి పదిమంది జీవితాలను కూడా ఉన్నత స్థాయికి తీసుకెళ్లే పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఊతంగా నిలబడుతోంది. ఆకలేస్తే చేపను ఇవ్వడం కంటే.. చేపను పట్టడం నేర్పితే ఆకలికి అవకాశం ఉండదని పెద్దలు ఏనాడో చెప్పారు కదండీ!. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణంలోని బొమ్మూరులో ఆర్ఐటీహెచ్‌ని సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.





పనులు చేస్తున్న దృశ్యం

ఏమిటీ హబ్‌లు?

ప్రైవేటు భాగస్వామ్యంతో యువతలో ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టడం ద్వారా నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడం ఈ హబ్‌ల ముఖ్య ఉద్దేశం. యువతలో మెరిసిన ఆలోచనను ఒడిసి పట్టుకొని మెరుగుపెడితే వారి ఎదుగుదలతోపాటు అభివృద్ధి, జీవన ప్రమాణ మెరుగుదలకు ఉపయోగపడే ఎన్నో నూతన విషయాలకు రూపం పోయవచ్చు. ఈ దిశగా ప్రయత్నాలు చేయడం కోసమే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త ఆవిష్కరణలు చేయడం, సవాళ్లను ఎదుర్కోవడం, అధిగమించడం వంటివి చేయడంలో యువతకు, పరిస్థితుల కు మధ్య ఉన్న అంతరాలను తొలగించి వారధిగా అవి నిలుస్తాయి. ఇప్పటికే ఆర్‌టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటాగ్రూప్, టాటాసన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారు. పారిశ్రామిక దిగ్గజాలైన ఓఎన్‌జీసీ, టాటా గ్రూప్, ఎల్‌అండ్‌టీ, రేమండ్, అదానీ పోర్ట్స్, ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్, గెయిల్ వంటి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఆర్‌టీఐహెచ్‌ని సమర్థవంతంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రతి కుటుంబం నుంచీ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం చంద్రబాబు సంకల్పంతో ఈ హబ్‌లు ఏర్పాటు అవుతున్నాయి. ఈ కలను సాకారం చేయడానికి పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకు రావాలని ఇప్పటికే ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఏపీ హబ్‌ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ఆ హబ్‌కి గొప్ప వ్యక్తి పేరు పెట్టాలని సంకల్పించి 'రతన్ టాటా' పేరు పెట్టారు.

యువతకు పూర్తి సహకారం

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు యువత భవితకు భరోసా అని చెప్పవచ్చు. స్టార్టప్‌లతో వచ్చే యువతకు పూర్తి సహకారం అందించే మార్గాన్ని చూపుతారు. మహిళలు, యువత, నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి ద్వారా పోటీతత్వంతో మార్కెటింగ్ చేసుకొనే విధానాలపై అవగాహన కల్పిస్తారు. హబ్‌ల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక బాధ్యత కింద దిగ్గజ పారిశ్రామిక సంస్థలు నిధులు సమకూరుస్తారు. యువతలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వం వంటి వాటిలో శిక్షణ ఇస్తారు. ప్రభుత్వం అందించే వివిధ పౌర సేవల్లోనూ ఆర్‌టీఐహెచ్ భాగస్వామ్యం అవుతుంది. భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్, కృత్రిమ మేధ వంటి రంగాల్లోని స్టార్టప్‌లకు సహకారం అందిస్తారు. వ్యవసాయం, ఆక్వా, మెరైన్, టెక్స్‌టైల్ ఇన్నోవేషన్, అపెరల్, ఫైబర్, ఇంధనం, క్లీన్‌టెక్, పునరుత్పాదన ఇంధనం, లైఫ్‌సైన్స్, ఫార్మా అండ్ హెల్త్, అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తారు. పట్టణ పౌర, వాణిజ్య రవాణా, జలరవాణా, గ్రామీణ మహిళా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు శిక్షణ ఇస్తారు. నైపుణ్యాలను వెలికితీసి అభివృద్ధి చేస్తారు.

రాజమహేంద్రవరంలో ఏర్పాటు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. బొమ్మూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఇప్పటికే భవనానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇది ఉభయగోదావరి జిల్లాల యువతకు వరమని చెబుతున్నారు. గవర్నింగ్ బాడీకి గ్రీన్ కో ఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి సీడ్స్ తదితర సంస్థలు ప్రమోటర్లుగా వ్యవహరించనున్నారు. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ హబ్‌ల్లో కృషి జరుగుతుంది. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంతోపాటు హబ్ ఏర్పాటు అదృష్టం రాజమహేంద్రవరానికి దక్కింది. దీంతో చారిత్రక నగరం భవిష్యత్తుల్లో స్టార్టప్‌లకు కీలక కేంద్రంగా మారే అవకాశం కనిపిస్తోంది. యువతకు ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, నూతన పారిశ్రామికవేత్తలను తయారు చేయడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా రాజమహేంద్రవరం ఆర్ఐటీహెచ్ ముందుకు సాగనుంది. ఈ హబ్‌లో కంప్యూటర్లు, హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం ద్వారా విధులు నిర్వర్తించే యువత ఇక్కడినుంచి పనిచేసుకునే వెసులుబాటును కల్పించనున్నారు. కొన్ని సదుపాయాలకు రుసుములు విధించే అవకాశం ఉంది. కలెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణపై నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ పూర్తిగా దృష్టిసారించారు. సహ-ప్రమోటర్లు, ప్రతినిధుల నుంచి ఐదుగురు అధ్యక్షులు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో కూడిన బృందాన్ని నియమించారు. నిర్వహణతోపాటు భాగస్వామ్యం, కార్పస్ ఫండ్, రూ.30 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నారు. పూర్తి విధి విధానాలు త్వరలోనే ప్రకటించనున్నారు. యువత తమ ఆలోచనలకు పదును పెట్టి 'ఆర్ఐటీహెచ్'లను ఒడిసి పట్టుకొంటే బంగారు భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి మార్గం సుగమమైనట్లేనని చెప్పడంఅతిశయోక్తి కాదు.

బాలబాలాజీ సన్నిధిలో పండిత సదస్యం

● కల్యాణోత్సవాల్లో ప్రత్యేక పూజలు ● భక్తుల కోలాహలం



బాలబాలాజీ సన్నిధిలో భక్తుల రద్దీ



బాలబాలాజీ సన్నిధిలో పండిత సదస్యం చేస్తున్న పండితులు

మామిడికుదురు, జూన్7(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణోత్సవాలు, శనివారం కావడంతో దేవస్థానం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. ఆలయ ఉపముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాచార్యులు, వేదపండితులు జోస్యుల సోమయాజులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, శ్రీవారికి సహస్ర నామార్చాన, బాలభోగ నివేదన, చతుష్టానార్చనలు, వేద పారాయణం, హోమాలు, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి, సదస్యం, వేద పారాయణం, నిత్య హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. ఉభయ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30మంది వేదపండితుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం వేద సదస్యం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. శనివారం స్వామివారిని 580మంది భక్తులు దర్శించుకుని, నిత్యాన్నదాన పథకంలో 3500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.4,16,615 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 10వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులువిశేషపూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,39,087 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.



విశేష అలంకరణలో శృంగార వల్లభ స్వామి

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ, స్వామి వారు



ఆత్రేయపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి ఒక్కరోజు ఆదాయం రూ.61.73 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఇదిలా ఉండగా వెంకన్న క్షేత్రంలో నవమ్మాళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు మూడో రోజు శనివారం నిర్వహించారు. వేదపారాయణం, పల్లకి మహోత్సవం కన్నుల పండువగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. శనివారం ఆలయం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. భక్తుల క్యూ వద్ద కూలర్లు, ఫ్యాన్లు, దాహార్తి తీర్చేందుకు మజ్జిగ, తాగునీరు అందిస్తున్నామన్నారు. చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు సైతం పంపిణీ చేస్తున్నామన్నారు. ఆలయ ప్రకార మండపంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తుల సమస్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రతి శనివారం సుమారు 50నుంచి 60వేల మంది స్వామిని దర్శించుకుంటున్నారని, 20 నుంచి 30 వేల మంది అన్నప్రసాదం స్వీకరిస్తున్నారన్నారు. త్వరలోనే భక్తులకు డార్మిటరీ నిర్మాణం, వసతి గదులు, ఉచిత బస్సు సౌకర్యం, సోలార్‌లైట్లు, ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్టు ఉపకమిషనరు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ముదునూరి వెంకట్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.61.73 లక్షలు

కోటసత్తెమ్మ సన్నిధిలో బూరుగుపల్లి పూజలు



పూజలు చేస్తున్న శేషారావు దంపతులు

నిడదవోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిమ్మ రాజుపాలెంలో వేంచేసి వున్న కోట సత్తెమ్మ వారిని శనివారం రాష్ట్ర స్కిల్ డెవలప్మెంటు కార్పొ రేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు తన కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శేషారావు దంపతులకు వేద ఆశీర్వాదాలు అందజేశారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రశిశంకర్ ఆలయ ఆచార ప్రకారం శేషారావు దంపతులను సత్కరిం చారు. కార్యక్రమంలో బూరుగుపల్లి శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలగన సూర్యా రావు, దేవస్థానం సూపరింటెండెంట్ జల్లా సోమరాజు పాల్గొన్నారు.

పేపర్‌లెస్ డాక్యుమెంట్ల విధానాన్ని రద్దు చేయాలి

ఏపీ దస్తావేజు లేఖరుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పేపర్‌లెస్ డాక్యుమెంట్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బీఎస్‌వీ సుబ్బారావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలుకు సిద్ధం చేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అయితే ఇప్పుడు ఇదే చట్టాన్ని కేంద్రం పేపర్ లెస్ డాక్యుమెంట్ పేరుతో మళ్లీ తెరమీదకు తీసుకువస్తుందన్నారు. ఈ విధానంపై ఈనెల 25 లోపు దస్తావేజు లేఖర్ల అభ్యంతరాలు తెలియజేయమని కేంద్ర ప్రభుత్వం కోరిందన్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలో దస్తావేజు లేఖర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించుకున్నామన్నారు. కేంద్రం అమలు చేయాలనుకుంటున్న విధానం వల్ల రాష్ట్రంలో లక్షకు పైబడి దస్తావేజు లేఖరులు, వారిపై ఆధారపడి జీవనం సాగించే కంప్యూటర్ ఆపరేటర్లు రోడ్డున పడతారన్నారు. దస్తావేజు లేఖర్ల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్లిమిల్లి వీర్రెడ్డి మాట్లాడుతూ తమ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో పేపరులెస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులకు, ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి వినతులు అందిస్తామన్నారు.సమావేశంలో లేఖర్ల సంఘం రాష్ట్ర లీగల్ అడ్వైజర్ బీజే ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదే రవికుమార్, సంఘం జేఏసీ సభ్యుడు మజ్జి గణపతిరావు, ఎస్‌హెచ్‌వీ రామకృష్ణ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు కోలా రామచంద్రరావు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మా ర్కులకు గాను 467 మార్కులు 24 మంది విద్యార్థులు సాధించారన్నారు. 466 మార్కులకు పైన 155 మంది, 465కు పైన 506 మంది, 463కు పైన 1224 మంది 460కు పైన 1775 మంది, 450కు పైన 2604 మంది సాధించారన్నారు. బైపీసీలో 440 మార్కులకు 437 మార్కులు మోహ్మద్ మనీష, గంగేయుల కృష్ణ చందన, కాడా గాయత్రి, గంపల వీర వెంకటలక్ష్మణ్ సాధించారు. 435 మార్కులు పైన 90 మంది, 430కు పైన 292 మంది, 400కు పైన 501 మంది సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.

కొవ్వూరు మున్సిపాల్టీ కూటమి కైవశం



అచ్చిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి, కౌన్సిలర్లు

- వైసీపీకి మున్సిపల్ చైర్‌పర్సన్, ముగ్గురు కౌన్సిలర్లు రాజీనామా
- టీడీపీలో చేరనున్నట్లు ప్రకటన
- మెజార్టీ కోల్పోయిన ప్రతిపక్షం

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీ టీడీపీ వశమైంది. తాజాగా వైసీపీకి చెందిన నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, 3వ వార్డు కౌన్సిలర్ వరిగేటి లలితకుమారి, 10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు, 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, మాజీ కౌన్సిలర్ బావన రాజేష్, వరిగేటి సుధాకర్ వ్యక్తిగత కారణాలతో, పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు శనివారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. అనంతరం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)లను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆసక్తితో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు ప్రకటించారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో సీఎం చంద్రబాబు సమక్షంలో నలుగురిని పార్టీలో చేర్చుకోనున్నట్టు తెలిపారు.

మెజార్టీ కోల్పోయిన వైసీపీ

కొవ్వూరు మున్సిపాల్టీలో 23 వార్డులు ఉండగా గత ఎన్నికల్లో వైసీపీ 15, టీడీపీ 7, బీజేపీ 1 వార్డు గెలుచుకున్నాయి. వైసీపీ నుంచి చైర్‌పర్సన్‌గా బావన రత్నకుమారి ఎన్నికయ్యారు. తాజాగా శనివారం వైసీపీ నుంచి 4 కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేశారు. అందులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఒకరు. దీంతో వైసీపీ బలం 15 నుంచి 11కి పడిపోగా టీడీపీ సంఖ్య 11కు చేరింది. బీజేపీ 1, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఓటుతో కలుపుకుని కూటమి బలం 13కు చేరింది. దీంతో కొవ్వూరు మున్సిపాల్టీ టీడీపీ వసం అవ్వడం దాదాపుగా ఖరారయ్యింది.

కొవ్వూరులో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో వైసీపీకి రాజీనామా చేస్తున్నానన్నారు. పార్టీ మారడంలో ఎవ్వరి ప్రలోభాలు లేవని, పూర్తిగా తమ సొంత నిర్ణయమన్నారు. కొవ్వూరు పట్టణాభివృద్ధిని కాంక్షిస్తూ కూటమి ప్రభుత్వం విధివిధానాలతో నచ్చడంతో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు పేర్కొన్నారు.

'వైసీపీలో బీసీలకు సముచిత స్థానం లేదు'

10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు మాట్లాడుతూ 2014, 19, 24 మూడు ఎన్నికల్లో వైసీపీ తరపున పనిచేశాను. ప్రస్తుతం కౌన్సిలర్‌గా పని చేస్తున్నాను. వైసీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 15వార్డులు విజయం సాధించి మున్సిపాల్టీని కైవసం చేసుకున్నప్పటికీ చైర్పర్సన్ ఎస్సీలకు రిజర్వు అయ్యింది. 2 వైస్‌చైర్మన్ పదవులు ఉండగా రెండూ ఓసీలకే కట్టబెట్టారు. అలాగే ఇటీవల నియోజకవర్గంలో పట్టణ, మూడు మండలాల అధ్యక్షులను మార్పుచేశారు. 3 మండలాల్లో ఏ సామాజికవర్గం అభ్యర్థిని మార్చితే అదే సామాజికవర్గం వారిని నియమించారు. కొవ్వూరులో అధ్యక్ష పదవి నుంచి బీసీ అభ్యర్థిని తొలగించి ఓసీలకు కట్టబెట్టారు. దీంతో మనస్తాపం చెంది వైసీపీకి రాజీనామా చేసి అన్నిరంగాలలో బీసీలకు పెద్దపీట వేస్తున్న తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానన్నారు.

15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ వార్డు ప్రజలు, అభిమానుల కోరిక మేరకు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నామని చెప్పారు.

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ బెటర్‌మెంట్ ఫలితాల్లో ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి అత్యుత్తమ మార్కులు సాధించినట్టు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 12మంది విద్యార్థులు 470 మార్కులకు గానూ 466 మార్కులు సాధించారన్నారు. అలాగే 54మంది విద్యార్థులు 465 మార్కులను, 79మంది 464 మార్కులను పొందినట్టు తెలిపారు. బైపీసీలో 440 మార్కులకుగానూ ఇద్దరు విద్యార్థినులు 436 మార్కులను, తొమ్మిది మంది 435, ఏడుగురు 434 మార్కులు, ఎనిమిది మంది 433 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీలో 500 మార్కులకుగానూ ఒక విద్యార్థి 493, ఇద్దరు 492, ఇద్దరు 491, ఇద్దరు 490 మార్కులు పొందినట్టు తెలిపారు. సీఈసీలో 500 మార్కులకు గానూ ఒకరు 491, ఒక విద్యార్థి 483 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

కాకినాడలో మెగా యోగా

- రికార్డుస్థాయిలో ఏడువేలమందితో యోగాసనాలు
- ఆకట్టుకున్న ఓంకారం.. కిలోమీటరు మేర కార్యక్రమం
- యోగాసనాలు వేసిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు
- ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు, యువత
- ప్రతిఒక్కరి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్





ఓంకార రూపంలో ఏర్పడిన దృశ్యం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు..

యోగాపై వివరిస్తున్న రామానంద



యోగా చేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ



జేసీ రాహుల్‌మీనా



కమిషనర్ భావన

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడువేల మందితో యోగాంధ్ర కార్య క్రమం నిర్వహించి రికార్డు సాధించారు. కాకినాడ నగరంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఎల్‌ఐసీ భవనం వరకు కిలోమీటరు మేరకు ఏడువేల మందితో శనివారం నిర్వహించిన మెగా యోగా కార్యక్రమం విజయవం తమైంది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ అంత ర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత నెల 21 నుంచి ఈనెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గ దర్శకాల ప్రకారం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల ఉపాధ్యాయులతో భారీ స్థాయిలో యోగా కార్యక్రమం చేశామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఏడువేలమంది హాజరయ్యారన్నారు. ఈ యోగా సాధన కేవలం అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు వరకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యజీవితాల్లో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగా ను రోజూ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారు మరింత సమర్థతతో విధులు నిర్వహించే ందుకు యోగా దోహదపడుతుంద న్నారు. ఈనెల 21న జిల్లా, మండల, గ్రామ స్థాయిలో యోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను, ప్రజాప్రతినిధు లను భాగస్వా మ్యం చేసుకుంటామ న్నారు. శనివారం జరిగిన యోగా కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు.

యోగతో ఆరోగ్యం..

ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడు తూ ప్రతిఒక్క పౌరుడికి ఆరోగ్యం చాలా అవసరమని, నిత్యం వివిధ రకాల మందులు వాడి ఆరోగ్యం పాడుచేసుకోకుండా యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చన్నారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లాలో యోగా కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమ న్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రం అంతటా పండుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉంద న్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వన మాడి కొండబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లే లక్ష్యంతోనే నెలరోజులపాటు నిర్వహించాలని సీఎం చంద్రబాబు కార్యాచరణ రూపొందించారన్నారు. సీఎం చంద్రబాబు 40 ఏళ్ల నుంచి యోగా సాధన చేయడం వల్లే ఇంకా ఎంతో ఆరోగ్యవంతంగా పని చేస్తున్నారన్నారు. యోగా శిక్షకుడు రామానంద అందరితో ఆసనాలు వేయించారు. అనంతరం యోగా శిక్షకులు రామా నందతోపాటు వేదికపై యోగాసనాలు వేసిన చిన్నారులను ముఖ్యఅతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, పాడా పీడీ చైత్రవర్షిణి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ఉపాధ్యాయులు, అధికారులు, యువత, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకానికి వచ్చి.. ప్రమాదంలో చిక్కి..

సీలేరు నదిలో నలుగురు యువకులను కాపాడిన పోలీసులు, జెన్‌కో ఉద్యోగులు

మరో యువకుడి గల్లంతు



ప్రమాదం నుంచి బయపడిన యువకులు



గల్లంతైన అభిలాష్ (ఫైల్‌ఫొటో)



నదిలో చిక్కుకున్నవారిని తాళ్ల సాయంతో బయటకు తీసుకొస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పర్యా టక ప్రాంతాల సందర్శనకు వచ్చిన యువకులు ప్రమాదంలో చిక్కుకున్న సంఘటన అల్లూరి జిల్లా మోతుగూడెం పరిధిలోని ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెం దిన 20 మంది తాపీ పని చేసే వ్యక్తులు శని వారం ఉదయం చింతూరు మండలం మోతు గూడెం పర్యాటక ప్రాంతాల సందర్శనకు రెండు టాటా మ్యాజిక్ వాహనాలపై వచ్చారు. మోతు గూడెం ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో న ది మధ్యలోకి ఐదుగురు యువకులు వెళ్లి స్నానా నికి దిగారు. అదే సమయంలో పొల్లూరు జల విద్యుత్‌కేంద్రంలో జెన్‌కో ఉన్నతాధికారులు విద్యుదుత్పత్తిని ప్రారంభించటంతో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో యువ కులు రాళ్లపైకి చేరి రక్షించడం అంటూ ఆర్తనా దాలు చేశారు. సమాచారం తెలుసుకున్న జెన్‌కో ఉన్నతాధికారులు ఒంటిగంట సమయంలో జన రేషన్ నిలిపివేశారు. ఎస్‌ఐ ఎస్‌కే సాధిక్, ఎంపీ టీసీ వేగి నాగేశ్వనరరావు, గజ ఈతగాళ్లు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, జెన్‌కో ఉద్యోగులు, గుత్తేదారు కార్మికులు, స్థానిక యువ కులు నది ప్రవాహం మధ్యలో చిక్కుకుపోయిన పి.సుధీర్, కె.నాగేంద్ర, సి.రామకృష్ణ, బి.ప్రభులను తాళ్ల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు తీసుకు వచ్చి కాపాడారు. అభిలాష్ (18) అనే యువ కుడు గల్లంతయ్యాడు. ఆ యువకుడి కోసం వి స్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఊడిన టైరు.. అదుపుతప్పిన లారీ



ఊడిపోయిన లారీ టైరు

శంఖవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకి నాడ జిల్లా రౌతులపూడి నుంచి శంఖవరం మీదుగా రావికంపాడు వెళ్తున్న లారీ టైరు ఊడిపోవడంతో అదుపుతప్పి గోడను ఢీకొంది. లారీ లోడుతో రోడ్డుకు అడ్డుగా ఉండిపోవ డంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయా ణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పోలీసులు రౌతులపూడి వెళ్లే వాహనాలను గౌరంపేట మీదుగా మళ్లించారు. సంఘటనా స్థలాన్ని స్థానిక టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ పరిశీలించి వందలాదిగా గ్రామాల్లో లారీలు తిరగకుండా చర్యలు చేపట్టాలని, విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో రాకపోకలు నిలిపివేయాలని పోలీసులను కోరారు.

లారీ బోల్తా

ఏలేశ్వరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం పరిధి చిన్నింపేటలో శనివారం లారీ బోల్తా పడింది. జాతీయ రహ దారిపై పంటపొలాల్లోకి వెళ్లిపోయింది. అయి తే ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. వి శాఖపట్నం పోర్టు నుంచి జిప్సం లోడును కర్ణాటకకు ఈ లారీ తీసుకెళ్తోంది. దీనిపై పోలీ సులకు ఎటువంటి సమాచారం అందలేదు.



వంద కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన గంజాయి, నిందితులతో చింతూరు పోలీసులు

చింతూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా నుంచి వయా చింతూరు మీదుగా వంద కిలోల గంజాయి తరలిస్తూ శనివారం ఇద్దరు నింది తులు పోలీసులకు పట్టుబడ్డారు. చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా కథనం మేరకు.. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టే షను పరిధిలోని తూలుగొండకు చెందిన కరణం రామాంజనేయులు, ఆరెళ్ళ బొజ్జి ఒడిస్సాలోని కొవ్వాసి తాతారావు వద్ద వంద కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వయా చింతూ రు మీదుగా కారులో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం లోని షేక్ సుభానికి గంజాయి చేరవేసేయత్నం లో పట్టుబడ్డారు. వారి నుంచి గంజాయి స్వాధీ నం చేసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్పీ తెలిపారు. కరణం రామాంజనేయులు, కొవ్వాసి తాతారావు, షేక్ సుభానీపై చింతూరు, డొంకరా యి పోలీసు స్టేషన్లలో ఇప్పటికే గంజాయి తర లింపు కేసులు ఉన్నాయని, వీరంతా గ్యాంగ్‌గా ఏర్పడి గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ తెల్లం దుర్గాప్ర సాద్, చింతూరు ఎస్‌ఐ పి.రమేష్, మోతుగూ డెం ఎస్‌ఐ షేక్ సాధిత్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన సాయి (ఫైల్)

తుని రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాకి నాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. నర్సీపట్నం రోడ్డు- గుల్లిపాడు రైల్వేస్టే షన్ మధ్యలో వ్యక్తి పట్టాలు దాటుతుండగా రాజమండ్రి వైపు వెళ్తున్న రైలు ఢీకొని సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడని తుని రైల్వే పోలీ స్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జి.మోహన్‌రావు తెలిపారు. మృతుడు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయపూడి గ్రామానికి చెందిన సాయి అని తెలిపారు. మృతుడికి త ల్లి, తండ్రి భార్య ఉన్నారు. అతడికి ఆరునెలల క్రితమే వివాహమైందని బంధువుల ద్వారా తెలిసిందన్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని మృతుడి సంబంధీకులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



ప్రాకారసేవలో పాల్గొన్న భక్తులు

అన్నవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రత్న గిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకా రసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చివా హనంపై ఆశీనులు గావించి తూర్పురాజగో పురం వద్దకు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు పండితుల వేదమం త్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. పండితుల మహదాశీర్వచనం అనంతరం తిరిగి ప్రధానాలయానికి స్వామి, అమ్మవార్లను తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు తదితరులున్నారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యదేవ నిత్యాన్న దాన పథకానికి శనివారం గుంటూరుకు చెందిన తోట రిషితశ్రీ 1,00,011 విరాళాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత

10 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు

9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు

కాకినాడ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని డీడీయుజీకెవై సెంటర్‌లో ఈ నెల 10వ తేదీ మంగళవారం నుంచి వికాస ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ప్రారంభంకానున్నాయని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ శిక్షణకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. టూ వీలర్ టెక్నీషియన్, వేర్ హౌ స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులలో 3 నెలల శిక్షణ ఇచ్చి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సెంట్రల్ గవర్నమెంట్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్ష ణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ అందిస్తామ న్నారు. ఈ కోర్సులతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంట ర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ సోమవారం లోపు సెల్ నంబర్లు 8328483297, 89784 75164లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పీడీ తెలిపారు.

కొనసాగుతున్న వాకతిప్ప చోరీ కేసు దర్యాప్తు

కొత్తపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో ఇటీవల జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. వాకతిప్పకు చెందిన పేరూరి శ్రీనివాసరావు మాస్టారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులను మారుతాళాలతో తెర చి సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20లక్షల నగదు చోరీకి గురైన విషయం విదితమే. ఇంట్లో సీసీ కెమెరా ఫుటేజీలో ఇద్దరు వ్యక్తులు తలుపులు బద్దలుకొట్టి లోపలకు ప్రవే శించారనే విషయం రికార్డు కావడంతో ఆయా ఫుటేజీల ఆధారంతో నిందితులు ఎవరనే విష యాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేప డుతున్నామని కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ చె ప్పారు. నాలుగైదు రోజుల్లో కేసు కొలిక్కి రావచ్చునని ఎస్‌ఐ అభిప్రాయం వ్యక్తం చేశారు.

వ్యక్తిపై దౌర్జన్యం

కేసు నమోదు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుకుంటున్న వ్యక్తిపై దౌర్జన్యం చేసి కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెచ్‌సీ లలితకు మారి తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజేంద్రన గర్‌కు చెందిన కొండాక తరుణ్ టాటాక్యాపిటల్ మైక్రో ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీన కొవ్వూరు మండలం వాడపల్లి వచ్చి గెల్లా లక్ష్మీ అనే ఆమె వద్ద ఈఎంఐ కట్టించు కుని వెళ్తూ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిల బడి ఫోన్ మా ట్లాడుతున్నాడు. ఇంతలో స్థలం యజమాని గెల్లా సతీష్ నా స్థలంలోకి ఎందు కు వచ్చావు అంటూ దౌర్జన్యం చేసి దుర్భాషలా డుతూ సెల్‌ఫోన్ లాక్కొని తలపై కొట్టి గాయ పర్చాడు. స్థానికులు గాయపడిన తరుణ్‌ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వచ్చిన సమాచారం మేరకు తరుణ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ లలితకుమారి పేర్కొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని క త్తితో దాడి చేసి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెం దిన పోతుల వెంకటేష్ శనివారం రాత్రి తన కొ డుకుని కొడుతున్నాడు. పక్కఇంటిలో ఉంటు న్న మల్లిన సతీష్ ఎందుకు పిల్లాడిని అలా కొడుతున్నావని అడిగాడు. దీంతో వెంకటేష్ కత్తి తీసుకువచ్చి నా కొడుకుని కొడుతుంటే నీ కెందుకు అంటూ చెవిపై గాయపర్చాడు. గాయమైన సతీష్‌ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు సతీష్ ఫిర్యాదుపై కేసు న మోదు చేసిన్టు సీఐ పి.విశ్వం పేర్కొన్నారు.

పేదలపై ఫీజులుం..

- పేద విద్యార్థులతో ప్రైవేటు స్కూల్స్ ఆటలు
- పలు యాజమాన్యాల అతి తెలివి
- అదనపు ఫీజులతో తల్లిదండ్రులు బెంబేలు
- ఒకటో తరగతి సీటని.. యూకేజీ అడ్మిషన్

రాజమండ్రికి చెందిన ఓ మెకానిక్ తన కొడుకును 1వ తరగతిలో చేర్పించడానికి ఆర్టీఈ చట్టం 12 (1)సీ ప్రకారం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసు కున్నాడు. తమ స్కూల్‌లో సీటు కేటాయింపు జరి గిందని, స్వయంగా వచ్చి మిగతా ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఓ కార్పొరేటు/ప్రైవేటు స్కూల్ నుం చి ఆయనకు ఎస్‌ఎంఎస్ వచ్చింది. పిల్లాడిని తీసు కుని ఆ స్కూల్‌కి వెళ్లాడు. అక్కడ విద్యార్థి చదువు, సామర్థ్యాన్ని పరీక్షించారు. అయితే ఆ పిల్లాడి లెవెల్స్ తమ స్కూలు స్టాండర్డుకు సరిపోదని చెప్పగా ఆ పేద తల్లిదండ్రులు కంగుతిన్నారు. వాళ్లు తేరు కోకముందే.. 'మీ పిల్లాడిని ఇక్కడే ఈ ఏడాది యూ కేజీలో జాయిన్ చేయండి. ఫీజు రూ.45వేలు' అని సెలవిచ్చారు. తమ కొడుకు పట్ల శ్రద్ధ వహిస్తామని ఆ తల్లిదండ్రులు ప్రాథేయపడగా సరే అన్నారు.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు స్కూల్స్ వ్యాపార యావ.. చదువుకునే హక్కును కూడా చదువుకునేవిధంగా మార్చేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని(ఆర్టీఈ) అపహాస్యం చేస్తోం ది. సామాజిక బాధ్యత మాట అటుంచితే ఆయా పాఠశాలల యాజమాన్యాల తెలివి తేటలకు పేద పిల్లల తల్లిదండ్రులు కళ్లు తేలేస్తున్నారు. ఇప్పటికే ఫీజుల మోత మోగిస్తున్న ప్రైవేటు పాఠశాలలు.. పేద విద్యార్థుల నుంచి కూడా ఏదో రకంగా దండు కోవాలని చూస్తున్నాయి. అన్నీ కాకపోయినా అధిక శాతం ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల పేదరికంతో ఆడుకుంటున్నాయి. తమ పిల్లాడికి కార్పొరేట్ స్కూ ల్లో ఉచితంగా సీటు లభించిందని ఆనందిస్తున్న తల్లిదండ్రులకు తీరా స్కూల్‌లో అడుగుపెట్టాక సొమ్ముల లెక్కలతో చుక్కలు చూపిస్తున్నారు. ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ నిరుపేద తల్లిదండ్రులు కన్నీటిని ఆశ్రయిస్తున్నారు. ఫీజు సంగతి ఎలా ఉన్నా.. అదనపు డబ్బులు చెల్లిం చుకోడానికి అప్పుల కోసం తిప్పలు తప్పడం లేదు.

తడిసి మోపెడు

విద్యా హక్కు చట్టప్రకారం ప్రతి కార్పొరేట్ స్కూల్‌లో ప్రతి ఏడాది ఒకటో తరగతిలో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. అమ్మ ఒడి/తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ప్రభు త్వం విద్యార్థుల తల్లికి ఇచ్చే డబ్బులను ఆ స్కూల్‌కి ఫీజు కింద చెల్లిస్తారు. ఈ విధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వందల సంఖ్యలో సీట్లు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆరు దశల ప్రక్రియ అనంతరం విద్యార్థి కోరుకున్న, ఇంటికి కాస్త దగ్గరగా ఉన్న స్కూ లును కేటాయిస్తారు. ఇదంతా ఆన్ లైన్ ద్వారా జరుగుతుంది. కేటాయింపు మెసేజ్ సదరు విద్యార్థి పేరెంట్స్‌కి వెళుతుంది. తర్వాత స్కూల్‌కి వెళ్లి తదుపరి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉం టుంది. అయితే ఇక్కడే కొన్ని పాఠశాలలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. బస్సు, యూనిఫాం, షూ, టై, ఆ రుసుము, ఈ ఫండు అంటూ తడిసి మోపెడు ఫీజును తల్లిదండ్రుల నెత్తి మీద పెడుతున్నారు. దీంతో ఆ పేద తల్లిదండ్రులకు ఏమీ పాలుపోని పరిస్థితి ఎదురవుతోంది. ఆ మాత్రం డబ్బులు కట్టలేని వాళ్ళకు కార్పొరేట్ చదువు ఎందుకంటూ చులకన మాటలను కూడా తల్లిదండ్రులు ఎదుర్కోవాల్సి వస్తోంది.



ఇదో రకం సమస్య

గతంలో నేరుగా ఒకటో తరగతిలో చేర్చేవారు. తర్వాత ఎల్‌కేజీ, యూకేజీలు వచ్చి చేరాయి. ఆ కేజీలు అన్ని చోట్లా ఒకే విధంగా ఉండవు. కాస్త చిన్న కాన్వెంట్లలో తక్కువస్థాయిలో చదువు ఉంటుందన్న విషయం తెలిసిందే. పలువురు తల్లిదండ్రులు చిన్న పిల్లలు కదా.. అప్పుడే చదువు పేరుతో రుద్దడం ఎందుకని ఆలోచించడం వల్ల కూడా ఏబీసీడీల్లో సైతం వెనుకబడుతున్నారు. దీంతో కార్పొరేట్ స్కూల్‌లో ఒకటో తరగతిలో చేర్చే సమయం వచ్చినపుడు ఈ పిల్లాడి స్థాయి కార్పొరేట్ చదువును అందుకోలేక పోతోంది. తరగతిలో పిల్లలందరిదీ ఒకరకం స్థాయి ఉంటే ఈ పిల్లలకు తక్కువ చదువు ఉంటోంది. దీంతో స్కూల్ యాజమాన్యాలు కూడా చేర్పించుకోవడానికి వెనుకడుగు వేస్తున్నాయి. తమ పిల్లలకు సరిగా చదువు చెప్పడం లేదనే మాట భవిష్యత్తులో తల్లిదం డ్రుల నుంచి పడాల్సి వస్తుందని భయపడుతున్నాయి. చదువులో వెనుకబడిన వారిని తీర్చిదిద్దడ మే అసలైన విద్యా నేర్పరితనం అనే వాదన వినవస్తోంది.



ఇబ్బంది ఉంటే చెప్పండి

ఆర్టీఈ చట్ట ప్రకారం పేద విద్యార్థులకు కేటా యించిన సీట్లలో కచ్చితంగా చేర్పించుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే విద్యాధికారుల దృష్టికి తీసుకు రావాలి. అలాగే విద్యార్థుల చదువుపై తల్లిదం డ్రులకు కూడా శ్రద్ధ వహించే బాధ్యత ఉంటుంది. కాస్త పికప్ అయ్యే వరకూ ట్యూషన్ పెట్టించడం, ఇంట్లో పట్టించుకోవడం వంటివి చేస్తే మంచిది. ఇబ్బంది పెడుతున్నారని మాకు ఫిర్యాదులు రాలేదు. ఒకవేళ వస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

కె.వాసుదేవరావు, జిల్లా పాఠశాల విద్యాధికారి, తూర్పు గోదావరి




బక్రీద్ సందర్భంగా పిఠాపురం పశువుల సంతలో పశువుల క్రయ, విక్రయాలు జరపరాదంటూ పురపాలకసంఘం ఏర్పాటు చేసిన బోర్డు, రోడ్డు మీదనే పశువుల అమ్మకాలు సాగిస్తున్న రైతులు

మునిసిపల్ అధికారుల అత్యుత్సాహం

- బక్రీద్ పేరుతో పశువుల సంత నిలిపివేత
- రోడ్డుపై అమ్మకాలు సాగించిన రైతులు
- అధికారుల తీరుపై ఆగ్రహం

పిఠాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పశువుల సంతవద్ద మునిసిపల్ అధికారుల అత్యుత్సాహం విమర్శలకు దారి తీసింది. బక్రీద్ వేళ గోవధ జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇదే విషయంపై విశ్వ హైందవ పరిషత్ ప్రతినిధులు అధికారులకు వినతిపత్రాలు అందజేసింది. గోవధ జరుపరాదన్న ప్రభుత్వ ఆదేశాలకు ఘనత వహించి మునిసిపల్ అధికారులు తమ సొంత భాష్యం చెప్పుకున్నారు. ముందస్తుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పిఠాపురం పట్టణంలో ప్రతి శనివారం నిర్వహించే పశువుల సంతను నిలిపివేశారు. బక్రీద్ సందర్భంగా సంతలో పశువుల క్రయ, విక్రయాలు జరపరాదని బోర్డు ఏర్పాటు చేయడంతో అక్కడ మునిసిపల్ అధికారులు, సిబ్బందితో నిఘా ఏర్పాటుచేశారు. విషయం తెలియక తెల్లవారుజాము నుంచి వందల సంఖ్యలో పశువులను తీసుకుని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతు లు ఇబ్బందులు పడ్డారు. కొనేందుకు వచ్చిన వారికి అగచాట్లు తప్పలేదు. కొంత సమయం వేచి చూసిన వీరు పశువుల సంతకు సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి చెంతనే తమ పశువులను ఉంచి క్రయ, విక్రయాలు సాగించారు. బక్రీద్ పేరుతో పశువుల సంతను అడ్డుకోవడం తాము ఎప్పుడూ చూడలేదని, రైతాంగమే క్రయ, విక్రయాలు సాగించే సంతపై అధికారుల ఆంక్షలు విధించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద అధికారుల అత్యుత్సాహం రైతులకు తీవ్ర ఇక్కట్లకు గురిచేసింది.

కాకినాడ

- కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

భక్తిశ్రద్ధలతో బక్రీద్



బక్రీద్ సందర్భంగా మాట్లాడుతున్న ముస్లిం మత పెద్ద

కాకినాడసిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పిఠాపురం రోడ్డులోని ఈద్గా మైదానంలో శనివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. జామియా మస్జిద్ ఇమామ్ అబ్దుల్ రజాక్ రిజ్వీఈద్ నమాజ్ నిర్వహించారు. ఈసందర్భంగా బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. నూరానీ కమిటీ తరపున జమాల్ శేక్ తనయుడు జుబేర్ పంపిన నూతన వస్త్రాలను కమిటీ సభ్యులు రెహ్మాన్ ఖాన్, లతీఫ్‌ఖాన్‌లు అబ్దుల్ రజాక్ రిజ్వీకి అందజేసి ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ నమాజ్ అనంతరం ముస్లిం లు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకు న్నారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు ఆద్ మైదానానికి చేరుకుని ప్రార్థనలు ఆచరించడంతో ప్రాంగణంతోపాటు పిఠాపురం రోడ్డులో ముస్లింలతో సందడి నెలకొంది.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలో బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్యాగానికి ప్రతీకైన బక్రీద్ సందర్భంగా ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి మసీద్‌లు, ఈద్గాల వద్దకు చేరుకున్నారు. ఉదయం 7గంటలకు ఆయా మసీదులలో, 9గంటలకు ఈద్గాలలో ఈద్ నమాజ్ నిర్వహించారు. ఇమామ్‌లు ఖుద్బా చదివి ఈద్ నమాజ్ నిర్వహించారు. ముస్లింలు పేదలకు దానధర్మాలు చేశారు.

రేపు పిఠాపురంలో పీజీఆర్ఎస్ రద్దు

పిఠాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో ఈనెల 9వ తేదీన నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను అనివార్య కారణాలవలన రద్దు చేసినట్లు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని ప్రజలు, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 90 శాతం ఉత్తీర్ణత



గంటా డెల్మా

పిఠాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థులు 90శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో నాలుగవ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ వి.కేశవరావు తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని 440కి 434 మార్కులు సాధించి నియోజకవర్గంలో ప్రథమస్థానంలో నిలిచిందని చెప్పారు.

వీల్‌చైర్ అందజేత

కాకినాడరూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అరుణ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ గొడారిగుంటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంవద్ద నరాల సమస్యతో బాధపడుతున్న కరప మండలం పెనుగుదురుకు చెందిన పడాల.హేమకీర్తనకు వీల్‌చైర్‌ను అందజేశారు. రూ.12,000 విలువచేసే వీల్‌చైర్‌ను పంతం ఫౌండేషన్ ద్వారా సమకూర్చారు. కార్యక్రమంలో కరప,కాకినాడ రూరల్ మండలాలకు చెందిన జన సైనికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌బాటలో యువత పయనించాలి

తాళ్లరేవు, జూన్ 7(ఆంధ్రజ్యోతి):యువత అం బేడ్కర్ బాటలో పయనించి ఆయన ఆశయాలను పాటించిననాడే ఘనమైన నివాళులర్పించినట్లు అవుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం పి.మల్లవరం పెదపేట గ్రామంలో అంబేడ్కర్ భవనం పునర్‌నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన భవనాన్ని ప్రారంభించి, అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాజీ జడ్పీచైర్మన్ దున్నా జనార్ధనరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన బహిరంగసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనకు తల్లిదండ్రులు జన్మనిస్తే అంబేడ్కర్ మహనీయుడు జీవితాన్ని అందించాడని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంపన రామకృష్ణ, దళితనేతలు కాశి లక్ష్మణస్వామి, జక్కుల ప్రసాద్, ధూళిపూడి వెంకటరమణ, కన్నీడి వెంకటరమణ, దడాల బుజ్జిబాబు, క్రిష్టాపర్, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కుడిపూడి శివన్నారాయణ, గ్రామపెద్దలు, రాంజీ యువజన సంఘం సభ్యులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర సుపరిపాలనను ప్రజలకు వివరించాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామాంజనేయచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామాంజనేయచౌదరి

పిఠాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు స్వీకరించి ఈనెల 9వ తేదీ నాటికి 11 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ సుపరిపాలన గురించి ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి సూచించారు. పిఠాపురం పట్టణ శివారులోని ఎస్ కన్వెన్షన్‌లో శనివారం జరిగిన బీజేపీ జిల్లా కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే నా ల్గవస్థానంలో నిలబెట్టారన్నారు. మాతృమూర్తి పేరుతో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు. 23వ తేదీన శ్యా ంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్, 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ చీకటి రో జులు గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, డీవీఎస్ రాజు, మట్టా మంగరాజు, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, గట్టి సత్యనారాయణ, చోడిశెట్టి రమేష్, బిళ్లకుర్తి రామేశ్వర రెడ్డి, ఓలేటి వెంకటేశ్వరరావు, కంబాల నాగేశ్వరరావు, తోట ఏడుకొండలు, బుర్రి మురళీధరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బొండుమట్టి రవాణాను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



మల్లివారితోటల్లో బొండుమట్టి తవ్వకాలను అడ్డుకొంటున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రమణక్కపేట, మల్లివారితోటల్లో అక్రమంగా తరలిస్తున్న బొండుమట్టి రవాణాను టీ డీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ అడ్డుకున్నారు. స్థానిక గ్రామస్థుల సమాచారం మేరకు ఆయన శనివారం ఉదయాన్నే బొండుమట్టి అక్రమంగా తరలిస్తున్న ప్రాంతానికి చేరుకొని తవ్వకాలను అడ్డుకున్నారు. మల్లివారితోటలు, రమణక్కపేట ప్రాంతాల నుంచి ప్రతీరోజూ రాత్రి సమయాల్లో 200 నుంచి 300లారీలపై బొండు మట్టి అక్రమ రవాణా సాగుతుందన్నారు. బొండుమట్టి తవ్వకాలకు అనుమతి ఉన్నట్లయితే పగటిపూట రవాణా చేసుకోవచ్చుకదా అని అక్కడ ఉన్న వారిని మాజీ ఎమ్మెల్యే వర్మ ప్రశ్నించారు. గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు బొండు మట్టి చెరువుల్లో మట్టి అమ్మకాల పేరుతో కోట్లాది రూపాయలు దోచేశారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ఇటువంటి అక్రమ వ్యాపారాలు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హెచ్చరించినా పోలీసులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక మంజూరు చేస్తున్నారని, బొండుమట్టిని ఇసుకలో కలపడం వలన భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణం బొండుమట్టి రవాణాదారులపై చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే వర్మ డిమాండ్ చేశారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ల నున్నట్టు ఆయన తెలిపారు.

అంబేడ్కర్ ఆడిటోరియంలో యోగా విజయవంతం



అంబేడ్కర్ ఆడిటోరియంలో యోగా ఆసనాలు దృశ్యం

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని భారతరత్న బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఇంటర్మీడియట్ విద్య, రెవెన్యూ, ఆయుష్‌శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ పరిధిలోని కళాశాలల అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది సుమారు 300 మందికి యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జ్యోతి ప్రజ్వలన చేసి యోగా తరగతులను ప్రారంభించారు. అనంతరం పతంజలి మహర్షి చిత్రపటానికి పూలమాలలు అలంకరించి వందనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్య ఆర్జేడీ శారద, కాకినాడ రూరల్ తహశీల్దారు కుమారి, ఆయుష్ వైద్యులు విజయలక్ష్మి, లక్షణకుమారి, యోగా చార్య చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు సింహాచలం మృతి తీరనిలోటు

- రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు

కాకినాడసిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నిస్వార్థంగా ప్రజలకోసం సేవ చేసిన నిజమైన ప్రజా సేవకుడు మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం అని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. ఈమేరకు క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతిపట్ల సంతాపం తెలిపారు. రాజకీయాలలో సింహాచ లం తత్వం చెరగని ముద్ర వేసిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన కొండబాబు

కాకినాడసిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పలువురు పేదలకు మెరుగైన వైద్యం నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శనివారం జగన్నాథపురంలోని తమ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 29 మంది బాధితులకు రూ.45లక్షల చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, వాసంశెట్టి చిట్టప్ప, గాది శివరామకృష్ణ, మేడిశెట్టి చిన్ని, పాలి కనాని, చొక్కా గిరి, మూగు రాజు, గుమ్మళ్ల చిన్న, మల్లాడి గంగాధరం, కేశంగి ప్రసాద్, లూటుకుర్తి మోహన్, వీర్ల లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

నిబద్ధత గల గొప్ప నాయకుడిగా సింహాచలం మన్ననలు

- జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నిబద్ధత గల ప్రజాప్రతినిధిగా, ప్రజలతో కలిసిమెలిసి పనిచేసిన గొప్ప నాయకుడిగా మన్ననలు పొందిన మాజీ ఎమ్మెల్యే సింహాచలం చిరస్మరణీయుడని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి తీవ్ర విచారకరమన్నారు. ఆయన సేవల్ని ప్రజలు తలచుకుంటూ ఎప్పటికీ గుర్తుంచుకుంటా రన్నారు. సింహాచలం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

గొల్లప్రోలులో ఉపాధ్యాయుల ధర్నా



గొల్లప్రోలు ఎమ్మార్సీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గొల్లప్రోలురూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేసి మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వ ర్యంలో గొల్లప్రోలు ఎమ్మార్సీవద్ద శనివారం సాయంత్రం ఉపాధ్యాయులు ధర్నానిర్వహించారు. ఇప్పటివరకూ జరిగిన బదిలీల్లో దొర్లిన తప్పులను సరిదిద్దాలని, విద్యాశాఖ కార్యదర్శి సమక్షంలో జరిగిన చర్చలు, హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కాకినాడ డీవైఈవో నాయుడు వెంకటేశ్వరరావు, ఎంఈవో శివప్రసాద్‌లకు వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీతారామరాజు, గొల్లప్రోలు మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గెడ్డమూరి ఈశ్వరరావు, మేడసాని సత్యనారాయణ, దాడి పద్మనాభం, విజయశంకర్, ఎ, సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ ఉద్యమ నేత చుక్కన వర్ధంతి



చుక్కన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమనేత, ఈపీఎఫ్ పెన్షనర్ల సంక్షేమం కోసం 'చుక్కన' అహర్నిశలు కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఉద్యమనేత చుక్కన సత్యనారాయణరాజు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం సీపీఎం నగరకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జి.బేబీరాణి, వర్మ, అయితా బత్తుల రామేశ్వరరావు, సీహెచ్ వెంకటరమణ, నాగాబత్తుల సూర్య నారాయణ, కె.వీరబాబు, చంద్రమళ్ల పద్మ, సీహెచ్ సతీష్, సీహెచ్‌వీ రమణ, రవికుమార్ పాల్గొన్నారు.

జనసేనలో చేరిన మాజీ కౌన్సిలర్ పెదిరెడ్ల

పెద్దాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పెద్దిరెడ్డి రామకృష్ణ జనసేనపార్టీ తీర్థం శనివారం పుచ్చుకున్నారు. ఆయనకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు వచ్చి తాను పార్టీలోకి చేరినట్లు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు పాలమరశెట్టి సత్తిబాబు, ఓబిలిశెట్టి గణేష్, లక్ష్మణ్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తుమ్మల బాబు

కాలువ పూడికతీత పనులు ప్రారంభం



కాలువ పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

కాకినాడరూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రూరల్‌మండలం పండూరు పీబీసీ పరిధిలోగల తమ్మవరం, నేమం గ్రామాలమీదుగా వెళ్లే జుత్తుక కాలువ పూడికతీత పనులను శనివారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.35లక్షల నిధులతో పూడికతీత పనులను చేపట్టినట్లు తెలిపారు. గతంలో జనసైనికులతో కాలువల పూడికతీత పనులను చేపట్టేవారమని ప్రస్తుతం ప్రభుత్వమే ఆపనులను చేపట్టడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు అమ్మిరాజు, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనీఫాం దుస్తులు అందజేత

సామర్లకోట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో 60మంది ఆగో డ్రైవర్లకు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు శనివారం యూనీఫాం దుస్తులను అందజేశారు. స్థానిక రఘురెసి డెస్సీ యాజమాన్యం దుస్తులను సమ కూర్చారు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు యూనీఫాం దుస్తులు ధరించి నిత్యం ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైం సీఐ అంకబాబు, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తదితర పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

పిఠాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పెడగాడి నాగమల్లేశ్వరరావు సమకూర్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన అందజేశారు. అనంతరం పేదలకు భోజనం వడ్డించారు. కార్యక్రమం నిర్వహించిన మల్లేశ్వరరావును వర్మ అభినందించారు.

చిల్లంగిలో విగ్రహ ప్రతిష్ఠ, జీవ ధ్వజ శిఖర మహోత్సవం

కిర్లంపూడి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిల్లంగిలో అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠ, జీవ ధ్వజ శిఖర మహోత్సవం శనివారం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, ప్రత్తిపాడు వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు వేర్వేరుగా హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అక్రమ కట్టడాలు కూల్చివేయాలి


ప్రకటన విడుదల చేస్తున్న శ్రీను

చింతూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్‌లో గిరిజనేతరులు చేపట్టిన అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మైదాన ప్రాంతం నుంచి వలస వచ్చిన గిరిజనేతరులు రహదారికి ఇరువైపులా దుకాణ సముదాయాలు నిర్మించుకున్నారని, రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా అక్రమ కట్టడాలను కూల్చివేయాలన్నారు. అలాగే కొంత మంది గిరిజనేతరులు రూ.వందకి రూ.10 వడ్డీకి ఇచ్చి రూ.లక్షలు ఆర్జిస్తున్నా రన్నారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలను కట్టడి చేయాలని శ్రీను డిమాండ్ చేశారు. ఆదివాసీల్లో కొంత మంది అవగాహన లేక గిరిజ నేతరులకు సహకరిస్తున్నార న్నారు. దీంతో గిరిజనులు ఆర్థికంగా నష్ట పోతున్నార న్నారు. కూల్చివేత చర్యలను అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అధికారులు ఒత్తిళ్లకు లోను కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘ఏజెన్సీలో అక్రమ కట్టడాలు తొలగించాల్సిందే’

ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్

రంపచోడవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు మోడిద నూకరాజు, ఉపాధ్యక్షురాలు బొరగా ఎర్రమ్మ, ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. 5వ షెడ్యూల్ ఏరియా మనుగడ, పరిరక్షణకు అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రయోజనకరమన్నారు. అధికారులు ఆదివాసీల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. అయితే గిరిజనులకు రాజకీయ సహకారం కరువైందని, చట్టాల అమలులో రాజకీయ నాయకులు అడ్డంకులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. చట్టాలపై అవగాహన లేని ప్రజాప్రతినిధులు ఓట్లు, రాజకీయ లబ్ధి కోసం చట్టాలను ఉల్లంఘించే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో కూల్చివేతలు నిలిపివేయాలని కోరడం ఇందులో భాగమేనని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నిచోట్లా అక్రమ నిర్మాణాలు కూల్చివేయాల్సిందేనని వారు డిమాండ్ చేశారు.

గిరిజనుడి వైద్యానికి మంత్రి లోకేశ్ ఆర్థికసాయం

కూనవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చూచిరేవులగూడెం గ్రామానికి చెందిన సోడే రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత రామకృష్ణకు లేదు. స్థానిక టీడీపీ నాయకుడు, అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రతినిధి గడేసుల రంజిత్ ట్విట్టర్ ద్వారా ఈవిషయాన్ని మంత్రి నారా లోకేశ్‌కు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై లోకేశ్ స్పందించి చికిత్సకు కావలసిన ఆర్థిక సహాయం చేస్తానని ట్విట్టర్ ద్వారా తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రూ.2.50లక్షల నగదును ఆసుపత్రికి పంపిస్తున్నట్టు లోకేశ్ లేఖ విడుదల చేశారు. ఈసందర్భంగా మంత్రి లోకేశ్‌కు, టీడీపీ నాయకుడు రంజిత్‌కు రామకృష్ణ కుటుంబ సభ్యులు, గిరిజన సంఘాలు కృతజ్ఞతలు తెలిపారు.

మోతుగూడెంలో బక్రీద్ వేడుకలు

మోతుగూడెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జామియా మసీదులో మత గురువు మహమ్మద్‌వజీర్‌తో కలిసి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

180 లీటర్ల సారా స్వాధీనం

రంపచోడవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): విశాఖ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగ రాహుల్ ఆధ్వర్యంలో ఆదివారం దేవీపట్నం మండలం పాముగండి గ్రామంలో దాడులు నిర్వహించారు. 180లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రజిత్ తెలిపారు. సారా తయారు చేసినా, విక్రయించినా టోల్ ఫ్రీ నెంబరు 14405కు సమాచారం ఇవ్వాలని కోరారు.


పట్టుబడిన సామగ్రితో ఎక్సైజ్ అధికారులు


అమ్మవారి ఆలయ ప్రాంతాన్ని సందర్శించిన జిల్లా అధికారి సుధారాణి

గండిపోశమ్మ ఆలయం ముంపు సమస్యపై ఆరా

దేవీపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గండి పోశమ్మ అమ్మవారి ఆలయాన్ని శనివారం దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అధికారిణి లక్ష్మీ సుధారాణి సందర్శించారు. పోలవరం ప్రాజెక్ట్ వల్ల ముంపునకు గురవుతున్న ఆలయ ప్రాంతాన్ని పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు కాపర్ డ్యామ్ వల్ల వచ్చే బ్యాక్‌వాటర్‌తో ఏర్పడే ముంపు సమస్యపై ఆలయ సిబ్బందితో ఆమె చర్చించారు. నూతన ఆలయ నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఆలయం వద్ద ఏర్పడే ముంపు సమస్య, ఇక్కడి పరిస్థితులు తదితర అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, గొందూరు గ్రామస్తులు, నాయకులు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

కూనవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కూనవరం మండలం టేకుబాకా గ్రామానికి చెందిన ముప్పిడి పుల్లమ్మకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. పుల్లమ్మ వృద్ధురాలు కావడంతో ఇంట్లో నుంచి ఏ వస్తువును బయటకు తీసుకోలేకపోయింది. గ్రామంలోని యువత మంటలను అదుపు చేశారు. ఇటీవల తీసుకున్న వృద్ధాప్య పింఛన్ డబ్బులు కూడా మంటల్లో కాలిపోయాయి.


ప్రమాద స్థలం వద్ద విలపిస్తున్న వృద్ధురాలు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్.తిమ్మాపురం వాసులు

జగ్గంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక రావులమ్మలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే నెహ్రూ నిర్వహించారు. మల్లిశాల గ్రామంలో లోఓల్టేజ్ సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. ఎస్.తిమ్మాపురం శివాలయం చేపల చెరువు వివాదాన్ని పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తాగునీరు, రోడ్లు, తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కుంచే రాజా, కొత్త కొండబాబు, అడబాల భాస్కరరావు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

‘ఆదిత్య’లో అడ్మిషన్ల సందడి



ఫస్ట్ ర్యాంక్ స్టూడెంట్‌ను అభినందిస్తున్న చైర్మన్ శేషారెడ్డి

గండేపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణం ప్రథమ సంవత్సరం 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. ఇంటర్‌లో 992 మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందిన అనపర్తికి చెందిన విద్యార్థిని నల్లమిల్లి సవిత కంప్యూటర్ సైన్స్ విభాగంలో చేరింది. ఆమెను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అభినందించారు. డాక్టర్ ఎంఎస్‌రెడ్డి, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ ఏ.రామకృష్ణ, అసోసియేట్ డీన్ అడ్మిషన్ డాక్టర్ ఆర్.గిరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు

కోటనందూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపినప్పుడు రికార్డులు లేకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ టీ. రామకృష్ణ హెచ్చరించారు. శనివారం కోటనందూరు శివారు కొంపకొండ వద్ద వాహనదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వాహనదారులకు తప్పనిసరిగా రికార్డులు ఉండడం వల్ల ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. కుటుంబానికి కొంత చేయూతగా ఉంటుందన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు ఏవినగరంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

తొండంగి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏవినగరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సీతా సౌమిత్రి సమేత రామచంద్రుల విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం ఉదయం 7.41 నిమిషాలకు జరుగుతుందన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా జరిగే కార్యక్రమానికి పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు.

భానుడి భగభగ


నిర్మానుష్యంగా ఉన్న ప్రత్తిపాడు ప్రధాన రహదారి

ప్రత్తిపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శనివారం భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు, వాహనదారులు విలవిల్లాడారు. సాయంత్రం నాలుగు గంటల వరకు వడగాల్పులు వీయగా, సాయంత్రం ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులువీయడంతో కాస్త ఉపశమనం పొందారు.


గోదావరిరేవుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు

దేవీపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గండి పోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి మట్టం అధికంగా పెరగడంతో ప్రమాదాల నివారించేందుకు రేవులను మూసివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గోదావరి రేవుల వద్ద ఫొటోలు దిగడం, సెల్ఫీ తీసుకోవడం, స్నానాలు చేస్తే ప్రమాదాల బారిన పడతారని తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. శ్రీఅమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు స్నానాలు ఆచరించేందుకు దేవాలయం వద్ద నీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. గోదావరి నదిలోకి స్నానాలకు వెళ్లవద్దని భక్తులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

టీడీపీ బలోపేతానికి కృషి : యనమల


టీడీపీలోకి చేరిన వారితో మాజీమంత్రి యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తొండంగి మండలం పెరుమళ్ళ పురం పంచాయతీ చింతకాయల పేట నుంచి భారీ ఎత్తున వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి యనమల సమక్షంలో టీడీపీలోకి చేరారు. తొండంగి టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, చొక్కా మహంకాళి, కొయ్యా మల్లేష్ ఆధ్వర్యంలో తేటగుంటలో జరిగిన ఈ కార్యక్రమానికి యనమల ముఖ్య అతిథిగా హాజరై పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కార్యకర్తలు వారధులుగా మారాలని యనమల తెలిపారు. పార్టీలో చేరిన వారిలో గంధం రమణ, సిరిపల్లి గోవిందు, కందా కొండబాబు, నక్కాదుర్గ, పి.ధారకొండ, సిరిపల్లి శ్రీను, గరికన సత్యనారాయణ, కొండబాబు, కోడా లోవరాజు, తదితరులు ఉన్నారు.

● పల్లా మరణంపై సంతాపం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తండ్రి పల్లా సింహాచలం మృతిపై మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్మిక రంగ సమస్యల పరిష్కారానికి ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తుని పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలు


పెద్ద మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

తుని రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని తునిలోని పెద్ద మసీదులో ముస్లిం సోదరులు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కబీర్ ఉదీన్ బక్రీద్ పర్వదిన విశిష్టను వివరించారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం జిల్ హజ్ 10న ముస్లింలు భక్తితో ఈంట్-ఉజ్- జుహ (బక్రీద్)జరుపుకుంటారని చెప్పారు. త్యాగం సమానత్వ విలువలను సమాజంలో వ్యాపింపచేయడమే బక్రీద్ పర్వదిన ఉద్దేశమని ముస్లిం మత గురువు కబీర్ ఉదీన్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ‘పల్లా’ మృతికి ఎమ్మెల్యే సంతాపం


పెదశంకర్లపూడిలో టీడీపీ సీనియర్ నేత జువ్విని నాగేశ్వర రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం (93) శనివారం ఆకస్మికంగా మృతి చెందడం పట్ల ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా తీవ్ర విచారం వెలిబుచ్చారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే పెదశంకర్లపూడిలో సీనియర్ టీడీపీ నాయకుడు జువ్విన తిరుపతిరావు కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శించారు. తిరుపతిరావు తండ్రి నాగేశ్వరరావు ఆకస్మికంగా మృతి చెందడంతో నాగేశ్వర రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్, ఉత్తరకంచి సర్పంచ్ మంతెన వెంకటరమణ, బీజేపీ జిల్లా నాయకుడు కందా వీరాస్వామి, టీడీపీ నాయకుడు యర్రాబత్తుల గోవింద నాయుడు, సుంకర భవాని తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సాయం



ఎస్ఐ మౌనికతో యశ్వంత్, జనసైనికుడు సతీష్

జగ్గంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలోని సత్తిరెడ్డిపేటకు చెందిన కర్రి యశ్వంత్ అనే బాలుడికి తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో నాన్నమ్మ అప్పలనరసమ్మ దగ్గర ఉంటూ ట్రినిటీ స్కూల్లో ఎనిమిదోతరగతి చదువుతున్నాడు. నిరుపేదైన యశ్వంత్ చదువుకు డబ్బుల అవసరాన్ని తెలుసుకున్న పెద్దాపురం జనసైనికుడు వంగలపూడి సతీష్ విషయాన్ని పెద్దాపురం పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో గతంలో అప్పటి డీఎస్పీగా ఉన్న లతా కుమారి ఓ విద్యాసంవత్సరానికి అవసరమైన డబ్బులు ఇవ్వగా, ఈ విద్యాసంవత్సరానికి పెద్దాపురం ఎస్ఐ మౌనిక డబ్బులు అందజేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

రంపచోడవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆదివారం సాయంత్రం ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన గిరిజనుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి వివరించారు.


ముఖ్యమంత్రిని కలిసి పలు అంశాలను వివరిస్తున్న బొజ్జిరెడ్డి

కాలువ పూడికతీత పనులు ప్రారంభం

కాకినాడరూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రూరల్‌మండలం పండూరు పీబీసీ పరిధిలోగల తమ్మవరం, నేమం గ్రామాలమీదుగా వెళ్లే జుత్తుక కాలువ పూడికతీత పనులను శనివారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.35లక్షల నిధులతో పూడికతీత పనులను చేపట్టినట్లు తెలిపారు. గతంలో జనసైనికులతో కాలువల పూడికతీత పనులను చేపట్టేవారమని ప్రస్తుతం ప్రభుత్వమే ఆపనులను చేపట్టడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షులు అమ్మిరాజు, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం


స్వీట్లు పంచుతున్న దృశ్యం

జగ్గంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం రోడ్డులో కోడూరి రంగారావు లైన్స్‌కంటి జిల్లా హాస్పటల్ నందు లయన్స్ క్లబ్ 108వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ లయన్స్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) ముఖ్యఅతిథిగా హాజరై లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మేల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.దయానా, హాస్పటల్ ఇన్‌చార్జ్ గంగరాజు, జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బద్ది సురేష్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత


చెక్కులను అందజేస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శనివారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, కుంచే రాజా, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లిరాజు, రాజపూడి సర్పంచ్ బుసాల విష్ణు, సర్వసిద్ధి లక్ష్మణరావు, ఎస్.బాబు, బొండా శ్రీనుబాబు, గల్లా రాము, ఉప్పలపాటి బుల్లి అబ్బులు, సాంబత్తుల చంద్రశేకర్, గనిశెట్టి సన్యాసిరావు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు 14 మంది విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

తుని రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లో తుని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 14 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు గంటా జయలక్ష్మి తెలిపారు. జిల్లాలో మొత్తం 190 మంది విద్యార్థులు అర్హత సాధించగా తుని బాలికల హైస్కూల్ నుంచి 14 మంది అర్హత సాధించడం అభినందనీయమని తెలిపారు. భవ్య, వసుంధర, ప్రసీద, లలిత, సౌజన్య, ప్రభావతి, మోక్షిత, శారోన్, హేమనైమిష, మాలతి, భావన, లాస్య, భువనేశ్వరి, అసీమ తదితరులు ఎంపికైనట్టు తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులకు తల్లికి వందనం రూ.15వేలతో పాటు 5 ఏళ్ల పాటు రూ.12వేలు చొప్పున ప్రతి ఏటా విద్యార్థుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తారని పేర్కొన్నారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


ఏలేశ్వరం సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో అనంతలక్ష్మి, సత్యనారాయణస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో పురోహితులు సత్యనారాయణ, బుజ్జి నేతృత్వంలో నిర్వహించిన ఈ మహోత్సవానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విచ్చేసి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో సుబ్బారావు దంపతులు దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.